క్లుప్తంగా

రైతు బజారులో దుకాణాల తనిఖీ



నందిగామ టౌన్: పట్టణంలో రైతుబజార్ ఎదుట ఉన్న షాపులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమణబాబు తనిఖీ చేశారు. షాపులు కేటాయించిన వారు కాకుండా ఇతరులు ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని డీవీఆర్ కాలనీ, ముక్కపాటి నగర్ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పైప్ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మున్సిపాలిటీకి అప్పగించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కోరారు. మంగళవారం శాప్ అధికారులు డీఎస్డీవో అజీజ్, నాగేశ్వరరావులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ రూ.కోటి 35 లక్షల మున్సిపల్ నిధులతో స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించినప్పటికీ ఇప్పటికీ శాప్ ఆధీనంలోనే ఉందని, దీనివల్ల ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉందన్నారు. ఈనెల 20న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శాప్ ఎండీని కలిసి స్విమ్మింగ్ పూల్‌ను మున్సిపాలిటికి అప్పగించాలని కోరడంతో మంగళవారం శాప్ అధికారులు జగ్గయ్యపేటకు వచ్చి స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించారన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, శాప్ అధికారులు పాల్గొన్నారు.

అవకతవకలు జరిగితే కేసులు నమోదుచేస్తాం



వత్సవాయి: ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని డ్వామా పీడీ ఏ రాము తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 1-4- 2023 నుంచి 31-3- 24 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించగా దానిపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరిగిన పనుల గురించి వివరాలు తెలుసుకున్నారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి పనులలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే వెంటనే రికవరీ చెల్లించాలని చెప్పారు. రికవరీ చెల్లించనిపక్షంలో అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, విజిలెన్స్ అధికారి ఎన్ బాలాజీ, ఎంపీడీవో ఎన్ రాంబాబు, ఏపీడీ పార్థసారధి, ఏపీవో రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

210 మందికి వైద్య పరీక్షలు



పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట మండలం పోచంపల్లి గ్రామ సచివాలయంలో పెనుగంచిప్రోలు మండలం కొణకంచి, జగ్గయ్యపేట మండలం వేదాద్రి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కె.వాణి, ఎస్.విష్ణువర్ధన్ 210 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఆయుర్వేద వైద్యం నయం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగా చేయటం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

ఈ క్రాప్ నమోదుపై అవగాహన

విస్సన్నపేట: రబీ పంటలు సాగు చేసే రైతులు వాటి వివరాలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని విస్సన్నపేట మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నరసాపురంలో రైతులకు ఈక్రాప్ నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. వరి, అపరాలు, మొక్కజొన్న సాగు చేసే రైతులు రైతు సేవా కేంద్రంలో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆటలకు దూరంగా బాలికలు

- జగ్గయ్యపేట బాలికల హైస్కూల్‌లో దుస్థితి
- 2.67 ఎకరాల క్రీడామైదానం ఉన్నా నిరుపయోగం
- క్రీడామైదానంలో కంపచెట్లు, జున్నుగడ్డి ఏపుగా పెరగడమే కారణం
- దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని వినతి



బాలికల హైస్కూల్ క్రీడా మైదానంలో దట్టంగా పెరిగిన కంపచెట్లు

జగ్గయ్యపేట అర్బన్: నూట పది ఏళ్ల క్రితం నిర్మించిన స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు క్రీడామైదానం ఉన్నప్పటికి నిరుపయోగంగా మారింది. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు దాతలు 2.67 ఎకరాలను క్రీడామైదానం నిమిత్తం ఇచ్చారు. అయితే సరైన ఆదరణకు నోచుకోక కంపచెట్లు, జున్నుగడ్డి పెరిగి నిరుప యోగంగా మారింది. దీంతో విద్యార్థినులు ఆడుకునేందుకు పరిస్థితులు అనుకూలించక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

గతం ఇదీ..

22వ వార్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను 1913లో స్థాపించారు. అప్పటి దాత అన్నవరం గ్రామానికి చెందిన గెంటేల వెంకట జోగయ్య పంతులు 4.89 ఎకరాల భూమిని పాఠశాలకు భూరి విరాళంగా ఇచ్చారు. నాడు బాలబాలికల (కో ఎడ్యుకేషన్) పాఠశాలగా కొనసాగింది. 1963లో ప్రత్యేకంగా బాలికల హైస్కూల్‌గా మార్పు చేయగా ఇప్పటి వరకు అలాగే కొనసాగుతోంది.

480 మంది విద్యార్థులు..



జగ్గయ్యపేటలో జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్

ప్రస్తుతం 480 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. 22 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలలో ఉత్తీర్ణతా శాతం ప్రతి యేటా 90 శాతం దాటుతున్నప్పటికీ, క్రీడల విషయంలోనే వెనుకబడి పోయింది. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ ఉన్నప్పటికీ వారికి క్రీడల్లో మంచి శిక్షణ ఇవ్వడానికి అవకాశం లేకపోవడంతో మిగతా అంశాలలోనే బోధన జరుగుతూ వస్తోంది. అదే క్రీడా మైదానం ఆటలు ఆడుకునేందుకు అనుకూలంగా ఉంటే ప్రతిభావంతులైన క్రీడాకారులు తయారయ్యేవారని అంటున్నారు.

పరిశ్రమల సామాజిక బాధ్యత ఏదీ..

జగ్గయ్యపేట పట్టణం పరిసరాల్లో అనేక కర్మాగారాలు ఉన్నప్పటికీ ఆయా యాజమాన్యాలు అయినా సహకారం అందించి గ్రౌండ్‌ను బాగు చేయించి వాడుకలోకి తీసుకువస్తే బావుండేదని తల్లిదండ్రులు అంటున్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ స్ఫూర్తితోనైనా ఇలాంటి సమస్యలపై వారు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. క్రీడా స్థలం నిరుపయోగంగా ఉండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

క్రీడలంటే ఇష్టం కానీ..



నాకు చదువుతో పాటు క్రీడలు అంటే చాలా ఇష్టం. బయట జరుగుతున్న స్కూల్ గేమ్స్, ఇతర ఆటల పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని ఆశగా ఉంది. కానీ మాకు క్రీడలు నేర్చుకోవడానికి, ప్రాక్టీసు చేయడానికి క్రీడామైదానం ఉన్నప్పటికీ, ఉపయోగకరంగా లేదు. నాతోపాటు తోటి విద్యార్థినులు చాలా బాధ పడుతున్నారు. ఆటలు ఆడుకునేలా గ్రౌండ్‌ను బాగుచేయాలి.

– ఎస్‌డీ.అమీన, 10వ తరగతి, ఏసెక్షన్ విద్యార్థిని

దాతలు ముందుకు వస్తే మేలు..



దాతలు ముందుకు వచ్చి క్రీడామైదానం బాగు చేయిస్తే బాగుంటుంది. విద్యార్థినులకు ఎంతో మేలు చేసిన వారవుతారు. మళ్లీ చెట్లు, పిచ్చి మొక్కలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. అప్పుడే చేసిన పనికి సార్థకత ఉంటుంది. పీడీల వద్ద క్రీడలు నేర్చుకోవడం, ప్రాక్టీసు చేసే అవకాశం లేకపోవడం వలన బాలికల్లో క్రీడా స్ఫూర్తి ఉండి కూడా ప్రతిభ కనబరిచే అవకాశం లేకుండా పోతోంది.

– ఆలవాల లక్ష్మి, హెచ్‌ఎం, గరల్స్ హైస్కూల్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు



రాంబాబు, కొండలును అభినందిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని గండ్రాయి గ్రామ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా నియమితులైన కుమ్మరి రాంబాబు, పార్టీ సోషల్ మీడియా మండల కార్యదర్శిగా నియమితులైన కొమ్ము కొండలును తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు అభినందించారు. కార్యక్రమంలో గండ్రాయి గ్రామ పార్టీ అధ్యక్షుడు దమ్మాలపాటి సత్యనారాయణ, గ్రామ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ సీనియర్ నాయకుడు శామ్యూల్ కన్నమాల, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మిర్చి పంటకు సోకింది వడలి తెగులని వెల్లడి

సాక్షి ఎఫెక్ట్



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి, శాస్త్రవేత్తలు

జగ్గయ్యపేట: మండలంలోని రామచంద్రునిపేట, గరికపాడు, తక్కెళ్లపాడు, పోచంపల్లి, షేర్ మహ్మద్‌పేట గ్రామాల్లోని మిర్చి పంటకు వడలి తెగులు సోకిందని ఉద్యానశాఖాధికారి టి.వర్ధిని, కేవీకే శాస్త్రవేత్త బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం 'మిర్చి పంటకు అంతు చిక్కని వైరస్' అనే కథనాన్ని 'సాక్షి' దినపత్రిక ప్రచురించింది. దీంతో శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖాధికారి రామచంద్రునిపేటలోని మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్చి పంటకు అంతు చిక్కని వైరస్ కాదని వడలి తెగులు అని తెలిపారు. మట్టి పరీక్షలు చేయకుండా ప్రతి ఏటా ఒకే పంటను సాగు చేయటం వలన సోకుతుందని తెలిపారు. రైతులు ముందస్తుగానే భూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తెగులు నివారణకు నీటి తడులు అవసరమైన మేరకే ఇవ్వాలని, పంటల మార్పిడి, వేసవిలో లోతు దుక్కులు వేసుకోవాలని చెప్పారు. అనంతరం పలు ఎరువులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, వెంకటరెడ్డి, వీఏవో అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శ



భాస్కరరావును పరామర్శిస్తున్న తన్నీరు, పక్కన వేల్పుల, గాంధీ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావుపై ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు దాడికి యత్నించి, దుర్భాషలాడిన ఘటనను వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఖండించారు. మంగళవారం భాస్కరరావును ఆయన స్వగృహంలో కలుసుకుని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన సొసైటీ మాజీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావును పరామర్శించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, పార్టీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జాన్‌మియా, ఎస్సీ సెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, నాయకులు కొత్తపల్లి పెంటయ్య, పాలాది వెంకటరమణ, ఉన్నం శ్రీనివాసరావు, దోసపాటి ప్రసాద్, యానాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును ఉద్యానవనంగా మారుస్తాం



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, స్వచ్ఛాంధ్ర ప్రతినిధులు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో విలియంపేట వద్ద డంపింగ్ యార్డును ఉద్యానవనంగా మారుస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. మంగళవారం డంపింగ్ యార్డును స్వచ్ఛాంధ్ర ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డు వలన సమీపంలో పద్మావతినగర్, విలియంపేట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఎంపీ కేశినేని చిన్నికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి వివరించామని తెలిపారు. ఆయన చొరవ తీసుకొని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభితో మాట్లాడి స్వచ్ఛ మిషన్‌లో భాగంగా పేట డంపింగ్ యార్డును ఉద్యాన వనంగా మార్చేందుకు ఏపీలోనే పైలట్ ప్రాజెక్టుగా జగ్గయ్యపేటను ఎంచుకున్నారని తెలిపారు. స్వచ్ఛాంధ్ర ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

జగ్గయ్యపేట అర్బన్: సీఎం చంద్రబాబునాయుడు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పునరుజ్జీవింపజేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు కృషి ఫలితంగా రూ.11,440 కోట్లు సాయాన్ని కేంద్రం ప్రకటించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు వెంకట్, సైదేశ్వరరావు, ఇత్రి నరసింహారావు పాల్గొన్నారు.

వ్యవసాయం, అనుబంధ రంగాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

గరికపాడు(జగ్గయ్యపేట): విద్యార్థులు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సి.భవానీ పేర్కొన్నారు. గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయం, అనుబంధ రంగాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండించే పంటలు, రైతుల శ్రమ, తదితరాలను తెలుసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువుల తయారీ పద్ధతిని వివరించారు. అనంతరం గ్రామంలోని మొక్కజొన్న పంటను పరిశీలించి విద్యార్థులకు సాగు విధానం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖాధికారి వర్ధిని, తదితరులు పాల్గొన్నారు.



క్షేత్ర సందర్శనలో విద్యార్థులతో ఏఓ రామసుబ్బారెడ్డి


అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి వరి పొలంలో క్షేత్ర స్థాయి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంఏవో కె.రామసుబ్బారెడ్డి ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన సమాచారం అందించటంతో పాటు సబ్సిడీపై విత్తనాలు, సొసైటీల ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయంపై వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు వివిధ పంట సాగు యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ మొదలైనవి వివరించటం జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రింగ్‌సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ఇబ్రహీంపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వాహనాల రాకపోకలతో 65వ నంబర్ జాతీయ రహదారిపై తలెత్తిన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి.

హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగ ముందు విజయవాడ వైపు వచ్చిన వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పలువురు వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పోలీస్ అధికారులకు తలకుమించిన భారంగా మారింది. దీనిపై స్పందించిన కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్ వ్యాపారాలు, సర్వీస్ రోడ్డు, సినిమా థియేటర్లు, ఇతర షాపింగ్ మాల్స్ వద్ద ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. తద్వారా పండుగ సెలవులు ముగిసి హైదరాబాద్ వైపు వాహనదారులు తిరుగు ప్రయాణం చేసే సమయానికి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపారు. రింగ్ సెంటర్ సమీపంలో హైదరాబాద్ బస్‌స్టాప్ వద్ద ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు నిలుపకుండా బస్‌స్టాప్‌లోనే ఆగేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐతో పాటు కానిస్టేబుల్స్ వాహనాల రాకపోకలకు అవాంతరాలు కలుగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అధికారుల చర్యలతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గుముఖం పట్టింది. ఈ విధానం పండుగ మూణ్నాళ్ల ముచ్చటగా కాకుండా దీర్ఘకాలంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స



పేరకలపాడులో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మావతి

పేరకలపాడు (కంచికచర్ల): పశుసంవర్ధక శాఖ ద్వారా గర్భకోశ వ్యాధులకు చికిత్సలు ఉచితంగా చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ రాష్ట్ర మానిటరింగ్ అధికారి డాక్టర్ పద్మావతి తెలిపారు. మండలంలోని పేరకలపాడు గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మేరకు డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ మేలు జాతి పెయ్యదూడల జననం కోసం లింగ నిర్ధారణ వీర్యం సరఫరా చేయటం జరు గుతుందన్నారు. నాలుగు గేదెల గోకులం షెడ్డుకు రూ.1.80 లక్షలు, ఆరు గేదెల షెడ్డుకు రూ.2.30 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వ ఉపాధిహామీ పథకంలో మంజూరవుతాయన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులు రైతులకు అందజేస్తామన్నారు. పశువుల గర్భకోశ వ్యాధులకు అవసరమైన చికిత్స చేసి మందులు అందజేస్తారన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, దూడలు, గొర్రె లు, మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందుతాయన్నారు. గ్రామంలోని 171 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. 978 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందజేశారు. సర్పంచి ఎం.సాత్విక, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఉమ, గండేపల్లి వెటర్నరీ వైద్యులు ఎం.నవీన్‌కుమార్, పశువైద్య సిబ్బంది ప్రియాంక, మానస, గాంధీ, గోపీ, భువనచారి, షోడగిరి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



కంచికచర్ల: రైతులు పంటలను రక్షించుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ మనీషా పేర్కొన్నారు. మండలంలోని పరిటాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పత్తి పంటలో తెల్లదోమలు ఆశించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి పంటకు తెగులు ఆశించకుండా లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారుల సూచనల మేరకు నీలిమందులను పిచికారీ చేయాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పశువైద్యాధికారులు పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్ వీఏఏ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

నందిగామ టౌన్: ప్రైవేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేష్, మస్తాన్, కిరణ్, వీరేష్ మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ కమ్మ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రముఖ మోటివేటర్ సంద్ర శేఖర్ విద్యార్థులకు మోటివేషన్ కలిగిస్తారని తెలిపారు. పరీక్షల భయాన్ని, అనుమానాలను నివృత్తి చేయటంతో పాటు భవిష్యత్తును ఏ విధంగా తీర్చిదిద్దుకోవాలి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవటానికి మార్గాలు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు.

పోలంపల్లి ఆనకట్ట పరిశీలన



పోలంపల్లి(వత్సవాయి): పోలంపల్లి ఆనకట్టను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలంపల్లి వద్ద మునేటిపై బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించిన చిన్న ఆనకట్టతోనే నేటివరకు సాగునీరు అందుతోంది. అధికార, అనధికారికంగా ఆనకట్టనుంచి మునేటి కాలువ ద్వారా 20 వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పారు. దానిస్థానంలో నిర్మాణం చేసిన కొత్త ఆనకట్ట అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఆనకట్టకు తెలంగాణవైపు పొలాలు కోతకు గురికావడంతో ఆనకట్ట పనులు చేసేందుకు తెలంగాణ ప్రాంతంలోని రైతులు అడ్డుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రితో మాట్లాడి తెలంగాణ ప్రాంతంలో కోతకు గురవుతున్న భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆనకట్టను త్వరగా పూర్తి చేసేవిధంగా అంచనాలను రూపొందించాలని అధికారులను కోరారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



కంచికచర్ల: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ పేద విద్యార్థినికి సాయం అందించి ఆర్య వైశ్య సంఘ నాయకులు మంగళవారం దాతృత్వాన్ని చాటుకున్నారు. నందిగామ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన కూరపాటి జోగయ్య కుమార్తె సాయి ప్రసన్న చెన్నైలోని భారత్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న కంచికచర్ల ఆర్యవైశ్య సంఘం ఆర్థికంగా చేయూత అందించాలని నిర్ణయించుకున్నారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆ విద్యార్థిని తండ్రి జోగయ్యకు రూ.23,516 నగదు అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఉన్నారు.

సారా తయారీదారుల బైండోవర్

విస్సన్నపేట: మండలంలో సారా తయారు చేస్తున్న 13 మందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం విస్సన్నపేట తహసీల్దార్ లక్ష్మి కల్యాణి ఎదుట బైండోవర్ చేశారు. చంద్రుపట్ల తండా, కలగర తండాలలో సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న వారిపై పలుమార్లు కేసులు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వీరిని షరతులతో కూడిన వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజర్ తెలిపారు.

రీసర్వేకు సహకరించాలి

ఆగిరిపల్లి: రీ సర్వేకు ప్రతి రైతూ సహకరించాలని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ కోరారు. మండలంలోని నరసింగపాలెంలో నిర్వహిస్తున్న రీ–సర్వే పనులను మంగళవారం పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే చేసే ప్రాంతంలో ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్వీ ప్రసాద్, రీ–సర్వే డీటీ మరియన్న, ఆర్ఐ యూనస్ తదితరులు పాల్గొన్నారు.